క్లుప్తంగా

రేపు మధ్యాహ్న భోజన కార్మికుల చలో విజయవాడ



తిరువూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమంలో తాము పాల్గొంటామని తిరువూరు మండల మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. ఆదివారం తిరువూరు ఎంఈఓ–2 రామకృష్ణకు మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ సుప్రజ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమ సమాచారాన్ని అందజేశారు. భోజన పథకం బడ్జెట్ పెంచాలని, జోన్ల వారీ మెనూ విధానం రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.10 వేలు ఇవ్వాలని వారు కోరారు. సీఐటీయూ తిరువూరు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు సుల్తాన్ బేగం, ముత్తమ్మ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రత్యేక డ్రైవ్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కొండపల్లి మున్సిపాల్టీ ఉద్యోగులు ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చికెన్ సెంటర్లు, కిరాణా షాపులు, మార్కెట్ సెంటర్, ఫ్యాన్సీ, బడ్డీకొట్లలో తనిఖీలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. కవర్లు వినియోగిస్తున్న వారికి మొదటి విడతగా రూ.300 ఫైన్ విధించారు. రెండోసారి పట్టుపడితే రూ.2 వేలు జరిమానా విధిస్తామని దుకాణదారులను హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు వినియోగించవద్దని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ



తిరువూరు: మచిలీపట్నంలో ఆదివారం జరిగిన జేఎస్ కేఎస్ ఆలిండియా ఓపెన్ కరాటే జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరువూరుకు చెందిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు బహుమతులు సాధించారు. హర్ష కరాటే ఇనిస్టిట్యూట్‌కు చెందిన జి. రాజేశ్వరి, సాయికిరణ్ ప్రథమ స్థానం, ఎన్. జాహ్నవి, టి. దీక్ష, శశాంకరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారని కోచ్ ఎం. నాగేశ్వరరావు తెలిపారు. చిన్నారులను పలువురు అభినందించారు.

తెలంగాణకు తరలుతున్న ఇసుక సీజ్

తిరువూరు: కృష్ణానది నుంచి టిప్పర్ల ద్వారా ఉచిత ఇసుక తెలంగాణకు తరలిపోతుండగా తిరువూరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. తిరువూరు చిరునామాతో ఉచిత ఇసుక బుక్ చేసి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అధ్వానంగా రహదారి



జి.కొండూరు: మండల పరిధి కుంటముక్కల గ్రామం నుంచి 30వ నంబరు జాతీయ రహదారి వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న పంచాయతీ రాజ్ రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైపోయి అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామస్తులు మైలవరం కానీ జి.కొండూరు వైపు కానీ వెళ్లాలంటే ఈ రహదారి ప్రధానం కావడంతో నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ సునీత శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారం, ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరు కావాలని కోరారు.

వడదెబ్బ.. జాగ్రత్తలతో రక్షణ

- నియోజకవర్గంలో మండుతున్న ఎండలు
- రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు



ఎండ తీవ్రతకు మధ్యాహ్నమే నిర్మానుష్యంగా మారిన జి. కొండూరు రోడ్డు

జి.కొండూరు: ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అప్పుడే నలభై డిగ్రీలకు చేరువవుతున్నాయి. ముఖ్యంగా మైలవరం నియోజకవర్గంలోని చెరువుల్లో నీరు కూడా అడుగంటడంతో ఉష్ణోగ్రతలు మరింత అధికమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలు దాటిన తర్వాత ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని జి.కొండూరు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నరాణి సూచిస్తున్నారు.

వడదెబ్బకు కారణాలు..

ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల, బైకులపై ప్రయాణాలు చేయడం వల్ల వడదెబ్బకు గురవుతారు. ఎండ తీవ్రత కారణంగా శరీరంలో తేమ శాతం తగ్గిపోయినప్పుడు దీని ప్రభావం మెదడుపై పడి, మనిషి అపస్మారక స్థితికి వెళతాడు. దీనిని వడదెబ్బకు గురైనట్లుగా భావించవచ్చు.

గుర్తించడం ఇలా..

వడదెబ్బ తగిలిన వ్యక్తికి నాలుక మీద తడి ఆరిపోతుంది. శరీరంలో వేడి పెరిగి కళ్లు తిరగడంతో పాటు వాంతులు, విరేచనాలు అవుతాయి. ఒళ్లంతా నొప్పులు, కళ్లు లోపలికి లాగినట్లు ఉంటాయి. ఇటువంటి లక్షణాలను గుర్తించిన వెంటనే బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి అస్పత్రికి తరలించాలి.

ప్రాథమిక చికిత్స ఇలా..

వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే దగ్గరలో ఉన్న నీడ ప్రదేశానికి తీసుకు వెళ్లాలి. శరీరంపై ఉన్న దుస్తులను తొలగించి చల్లని నీటితో శరీరం మొత్తం తడిచే విధంగా కాటన్ వస్త్రంతో తుడవాలి. నీటిలో ఓఆర్ఎస్ఎల్ కలిపి పలుసార్లు తాగించాలి. అనంతరం దగ్గర్లో ఉన్న వైద్యశాలకు తరలించాలి.

ఎక్కువ ప్రభావం ఉండేది వీరిపైనే..

పిల్లలు, వృద్ధులు, గర్భిణులపై వడ దెబ్బ ఎక్కువగా ప్రభావం చూపుతుంది. పిల్లలను ఎండలో తిరగకుండా చూసుకోవాలి. గర్భిణులు చలువ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఏడాదిలోపు పిల్లలను చల్లని ప్రదేశంలో పడుకోబెట్టాలి. అప్పుడే వడదెబ్బ నుంచి పిల్లలను రక్షించుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా ఉండాలి. రైతులు, ఉపాధి కూలీలు 11 గంటల లోగా పనులను ముగించుకొని ఇంటికి తిరిగి రావాలి. ఎండలోకి వెళ్లే వారు టోపీలు, గొడుగులు వాడాలి. రహదారుల పక్కన తినుబండారాలను తినకూడదు.
శీతల పానీయాలను తాగకూడదు. ఫ్రిజ్‌లో నీరు ఎక్కువగా తాగకూడదు. కొద్దిపాటి చల్లదనం ఉన్న పదార్థాలనే తీసుకోవాలి. రోజుకు ఐదు లీటర్ల నీరు తాగాలి. కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, మజ్జిగ, నిమ్మరసం వంటి చలువ పదార్థాలు తీసుకోవడం వలన వడదెబ్బ నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. తెల్లని దుస్తులు, లేత రంగు దుస్తులు ధరించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు.

అందుబాటులో మందులు



ప్రాథమిక వైద్యశాలలో వడదెబ్బకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి. సెలైన్లు, ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. హాస్పటల్‌లోనే కాకుండా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల వద్ద కూడా ఓఆర్ఎస్ఎల్ సిద్ధంగా ఉన్నాయి.
– డాక్టర్ ప్రసన్నరాణి, జి.కొండూరు మండల వైద్యాధికారి

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'మీకోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 17న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా డివిజన్‌లోని ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
- **ముసునూరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇవ్వాలని ఆయన కోరారు.

నేడు తిరువూరులో 'నవోదయం' సమావేశం

తిరువూరు: సారా రహిత జిల్లా సాధనలో భాగంగా తిరువూరులో సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో నవోదయం సమావేశం జరుగుతుందని తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఆర్డీఓ మాధురి, ఎక్సైజ్ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. తిరువూరు సర్కిల్‌లోని బెల్లం వ్యాపారులు, పాత నేరస్తులకు ఈ సమావేశంలో అధికారులు సారా రహిత సమాజ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మైలవరం: సోమవారం నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాశాఖాధికారి ఎల్. బాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలంలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. మైలవరం ఎస్వీఆర్‌జీ బాలుర ఉన్నత పాఠశాలలో 235 మంది విద్యార్థులు, ఎంబీఎం బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 238 మంది, వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, మైలవరంలో 240 మంది, ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో 235 మంది, చిలుకూరివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది, మొత్తం 1,428 మంది విద్యార్థినీ విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. ఓపెన్ టెన్త్ క్లాస్ పరీక్షలకు సంబంధించి మూడు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 208 మంది విద్యార్థులు ఓపెన్ టెన్త్‌కు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. మంచినీరు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు.
- **చాట్రాయి:** మండలంలోని చాట్రాయి ఆర్‌సీఎం స్కూల్, జెడ్పీ హైస్కూల్లోని పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి జరుగుతాయని ఎంఈఓ బ్రహ్మచారి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 17న హిందీ, 19న తెలుగు, 21న ఇంగ్లిషు 1, 22న ఇంగ్లిష్ 2, 24న గణితం, 26న సైన్స్, 28న సైన్స్–2, 31న సోషల్ పరీక్షలు జరుగుతాయని వివరించారు.
- **ఆగిరిపల్లి:** సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ కలపాల సర్వేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లిలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఎస్‌వీ పబ్లిక్ స్కూల్‌లో 567 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు.
- **విస్సన్నపేట:** నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విస్సన్నపేట మండలంలో 1,107 మంది విద్యార్థులు హాజరవుతారని ఎంఈఓ సుధాకర్ తెలిపారు. విస్సన్నపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, సెంట్ థెరిస్సా, వికాస్, శ్రీ సిద్ధార్థ, శ్రీశ్రీ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

అమరజీవి పొట్టిశ్రీరాములుకు నివాళి



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు :



మైలవరంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానిక నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆదివారం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర కోసం ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను వక్తలు కొనియాడారు. నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎంఏ బేగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **మైలవరం:** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం మైలవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక నూజివీడు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

చాట్రాయి: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నడిపల్లి కిశోర్ అన్నారు. చనుబండలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కిశోర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు కొత్తా కాంతారావు, కె.రామలింగేశ్వరరావు, నారాయణ, వనమా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- **తిరువూరు:** ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గంపలగూడెం మండలం పెనుగొలను గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి గ్రంథాలయాధికారి జె. శ్రీలత, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

నూజివీడు: తెలుగు జాతి ఒక్కటిగా ఉండాలనే ఉన్నత ఆశయంతో ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములని నూజివీడు వాసవీ క్లబ్ అధ్యక్షులు గాదె శివరామకృష్ణ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ త్యాగధనుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత దేశ, రాష్ట్రాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. సెక్రటరీ చిట్టూరి కిశోర్‌కుమార్, కోశాధికారి చలువాది రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పరిశ శ్రీనివాస కుమార్, ఆర్యవైశ్య సంఘం నూజివీడు మండల అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు రాజుపేటలోని అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరువూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆర్య వైశ్య సమాజ నాయకులు గుడిమెట్ల మురళి, జంగాల మురళి, నాళ్లా సురేంద్ర తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంపలగూడెం మండలం ఊటుకూరు గాంధీ సెంటర్‌లో అమరజీవి జయంతి సందర్భంగా గ్రామస్తులు నివాళులర్పించారు.



ఊటుకూరులో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



నూజివీడులో నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు



చనుబండలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

యథేచ్ఛగా వందేళ్ల నాటి చెట్ల నరికివేత

- వాల్టా యాక్ట్‌కు తూట్లు
- పట్టించుకోని అధికారులు



మైలవరంలో వేప చెట్టును నరుకుతున్న కూలీలు



నరికిన వేప చెట్టును తరలిస్తున్న ట్రాక్టర్

మైలవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఊరూరా చెత్తను తొలగిస్తూ, మొక్కలు నాటుతూ, అంతరించిపోతున్న అడవులను పరిరక్షించుకోవాలని చేస్తున్న ప్రచారం ప్రకటనలకే పరిమితమైంది. వాల్టా యాక్టుకు తూట్లు పొడుస్తూ వందేళ్ల చెట్లను కూడా యథేచ్ఛగా నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. మైలవరంలోని ప్రధాన కూడలిలో గ్రామ పంచాయతీకి అతి సమీపంలో పంచాయతీకి చెందిన స్థలంలో దశాబ్దాల చరిత్ర కలిగి ఎంతో మందికి నీడ ఇచ్చిన వేప చెట్టును ఆదివారం నరికివేసి కలపను ఇతర ప్రాంతాలకు తరలించారు. దీనిపై గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికారుల ప్రమేయం లేకుండానే ఇది జరిగిందా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రైవేట్ ఆస్పత్రి వాహనాలు రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేందుకే వందేళ్ల చరిత్ర కలిగిన వేప చెట్టును నరికివేశారని ఆరోపిస్తున్నారు. చెట్టును నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో చూర్ణోత్సవం





పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు : వేణుగోపాలస్వామి ఆలయంలో చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం అనంతరం స్వామివారికి చూర్ణోత్సవం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, భక్తులు స్వామి వారి విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఉప ప్రధానార్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు చక్రతీర్థం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా భావనారుషి కల్యాణం

తిరువూరు: పద్మశాలీయుల మూలపురుషుడు భావనారుషి కల్యాణ మహోత్సవం ఆదివారం తిరువూరు మార్కండేయ భవనంలో నిర్వహించారు. పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భావనారుషి, భద్రావతీదేవి కల్యాణాన్ని అరిపిరాల అప్పయ్య శాస్త్రి జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. పద్మశాలీయుల సంఘం గౌరవాధ్యక్షుడు నల్లమోలు మధుసూదనరావు, అధ్యక్షుడు స్వర్గం నాగేశ్వరరావు, కార్యదర్శి పర్వతం రామారావు, కోశాధికారి అవ్వారి శౌరి, ఉపాధ్యక్షుడు నల్లమోలు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



జి.కొండూరు: పలు కేసుల్లో అనుమానితులు, నిందితులుగా ఉన్న వ్యక్తులు నేరాలకు, వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. జి.కొండూరు పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసులలో నిందితులుగా, అనుమానితులుగా ఉన్న 25 మందికి స్థానిక పోలీసు స్టేషన్ ప్రాంగణంలో సీఐ చంద్రశేఖర్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.
- **మైలవరం:** రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం ఎస్ఐ బి. మోహనరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఇక ముందు తమ కార్యకలాపాలు నిలిపివేయాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. రౌడీషీటర్లు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని, వారిపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చే శామని చెప్పారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



చాట్రాయి: మండలంలోని చనుబండ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2003–04 సంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికి ఒకరూ ఆత్మీయంగా పలకరించుకుని క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. నాటి స్మృతులను తలచుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థి వల్లభనేని గిరిబాబు పూర్వ విద్యార్థుల సంక్షేమ నిధికి రూ.లక్ష అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.